క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

గోనెగండ్ల: మండలం సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ టి.నసురుద్దీన్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు ఉంటుందని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్, ఇతర శాఖాధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

ముగిసిన ఉరుసు

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్ కైరవాడి గ్రామంలో హజరత్ అల్లీసాహెబ్ స్వాముల ఉరుసు మహోత్సవం ఘనంగా జరిగింది. మంగళ, బుధవారాల్లో గంధం, ఉరుసు కార్యక్రమాలు, గురువారం కిస్తీ కార్యక్రమంతో మహోత్సవాలు ముగిశాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

వెల్దుర్తి: మండల పరిధిలోని బోయనపల్లె అంగన్‌వాడీ-1 కేంద్రాన్ని గురువారం రామళ్లకోట సెక్టార్ సూపర్‌వైజర్ శోభారాణి ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు, స్టాకు పరిశీలించారు. పిల్లలు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారంపై వాకబు చేశారు. అనంతరం వారితో సమావేశమై ఆరోగ్య సిబ్బంది సూచన మేరకు జాగ్రత్తలు పాటించాలని, అంగన్‌వాడీకి వచ్చి పౌష్టికాహారం భుజించాలన్నారు. పుట్టిన పిల్లలకు 6 నెలల వరకు తల్లిపాలు పట్టించడం మంచిదన్నారు. టీచర్లు, ఆయా ఉన్నారు.

ఉపాధ్యాయుడి మృతి తీరనిలోటు

గోనెగండ్ల: ములగుందం మండల పరిషత్ ప్రాథమిక మెయిన్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గోనెగండ్లకు చెందిన మురళీమోహన్ అనారోగ్యంతో బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్టీయూ నాయకులు గురువారం గోనెగండ్లలోని మురళి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి భౌతికకాయానికి నివాళులర్పించారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవ ప్రసన్నరాజు, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, ఎల్లప్ప, జగదీష్, రామచంద్ర తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


రాఘవరెడ్డి (ఫైల్)

మద్దికెర: మండల పరిధిలోని బురుజుల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రాఘవరెడ్డి (49) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఉదయం గుంతకల్లులో బంధువుల వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా మద్దికెర ప్రభుత్వ వైద్యశాల వద్దకు రాగానే కళ్లు తిరిగినట్లు కావడంతో వైద్యశాలకు వెళ్లి వైద్యుడితో పరీక్షలు చేయించుకుంటుండగా గుండెపోటుకు గురై వాంతులు చేసుకుంటూ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు దేవిరెడ్డి మురళీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు తదితరులు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. రాఘవరెడ్డి పార్టీలో కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడని పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు.

చురుగ్గా సీసీ రోడ్డు పనులు

తుగ్గలి: మండల పరిధిలోని ఆర్.కొట్టాలలో సీసీ రోడ్డు నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారంలో భాగంగా ఆర్.కొట్టాలకు రూ.5 లక్షలు, రామాపురానికి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను గురువారం సర్పంచ్ కమాల్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఓబులేసు, హుసేన్‌బాషా, గోవిందరాజు పరిశీలించారు. సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పందికోన గ్రామంలో గురువారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. విద్యుత్ తీగల ఎర్త్ వల్ల నిప్పురవ్వలు ఏర్పడి గడ్డివాములు కాలిపోయినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదంలో రూ.50 వేలు విలువైన పశుగ్రాసం మంటల్లో కాలిపోయిందని బాధిత రైతులు బుల్లేని రంగస్వామి, ఎర్రమల పెద్దరంగన్న వాపోయారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా చూడాలని, అలాగే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రత్యేక అధికారి బాలకృష్ణారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని బురుజుల, మద్దికెర-1, 2 ఎం.అగ్రహారం సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించారు. అనంతరం సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎస్‌డీజీ (స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు) సాధించే దిశగా అడుగులు వేస్తోందన్నారు. అందులో భాగంగా ఇంటింటి సర్వే పూర్తి చేసి ఆయుష్మాన్ కార్డులు అందజేసిందన్నారు. వివిధ దశల్లో రక్తహీనత ఉన్న స్త్రీలను గుర్తించాలన్నారు. ఎంపీడీఈఓ నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి


మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానానికి బరిలో ఉన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు, నాయకులతో సమావేశం నిర్వహించి, రవీంద్రారెడ్డి గెలుపునకు చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత యువతకు సచివాలయ ఉద్యోగాలను కల్పించారన్నారు. అలాగే పోలీసు శాఖలో ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వచ్చాయని గుర్తుచేశారు. మిగిలిపోయిన సచివాలయ ఉద్యోగాల భర్తీకి సైతం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో దశల వారీగా ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అందువల్ల పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతు తెలపాలని కోరారు. వార్డు పరిధిలో ఉండే పట్టభద్రులకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, సచివాలయ ఉద్యోగాల కల్పన తదితర అంశాలపై వివరించి ఓట్లు వేయించాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ కుమారస్వామిరెడ్డి మాట్లాడారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, కో-ఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ షబ్బీర్‌అహమ్మద్, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

వెల్దుర్తి: మండల పరిధిలోని బింగిదొడ్డి మజారా కాశాపురంలో ఆంజనేయస్వామి ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠ గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో మూడురోజులుగా నిర్వహించిన ప్రతిష్ఠ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ విడివిడిగా ఆలయానికి చేరుకుని స్వామివారికి, ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు సమీర్‌కుమార్ రెడ్డి, కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, సూదేపల్లె శరభారెడ్డి, బింగిదొడ్డి సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న శైవ క్షేత్రాలు


శ్రీగిరి క్షేత్రంలో వెలసిన పంచలింగేశ్వర స్వామి

ఆస్పరి: మహా శివరాత్రి వేడుకలకు మండలంలోని శైవ క్షేత్రాలు విద్యుదీపాలంకరణతో సుందరంగా ముస్తాబయ్యాయి. ఆస్పరిలోని మూల ఈశ్వర స్వామి, పక్కీరప్ప తాత, రామతీర్థంలోని రామలింగేశ్వర స్వామి, బిణిగేరిలో శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి, కైరుప్పల్లోని వీరభద్ర స్వామి, మహాలింగప్ప ఆలయాల్లో మహా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈనెల 18వ తేదీన రామతీర్థంలో రామలింగేశ్వర స్వామి ప్రభ, 19న ఆస్పరిలో పక్కీరప్ప తాత రథోత్సవం, బిణిగేరిలో వెలసిన శ్రీగిరి పంచలింగేశ్వర క్షేత్రంలో శివపార్వతుల కళ్యాణం, వీరభద్ర స్వామి వేషధారణతో ఖడ్గాలు, గొరవయ్యల పాలసేవ, జ్యోతి వెలిగించడం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బిణిగేరి సమీపంలో వెలసిన పంచలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నవగ్రహాలు ప్రతిష్ఠించడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. 20వ తేదీన ప్రత్యేక పూజలు, పంచలింగేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు శ్రీనివాసులు స్వామి, తిమ్మగురుడు స్వామి, శాంతిరెడ్డి తెలిపారు.

శ్రీశైలానికి బయలుదేరిన శివస్వాములు


ఆలూరు కోటవీధి ఆలయం నుంచి పయనమైన శివస్వాములు

ఆలూరు: మహాశివరాత్రి పురస్కరించుకుని శ్రీశైల భ్రమరాంబామల్లికార్జున స్వామివారిని దర్శించుకునేందుకు ఆలూరుకు చెందిన శివ మాలదారులు గురువారం బయలుదేరివెళ్లారు. అంతకుముందు స్థానిక కోట వీధిలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో బిల్వార్చన, గంగ, ఫల, పుష్ప పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం 150 మందికి పైగా శివమాలదారులు శ్రీశైలానికి బయలుదేరివెళ్లారు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు మేళతాళాలతో ఊరేగింపుగా వారిని సాగనంపారు.

ఆస్పరి: మండలంలోని డీ.కోటకొండ గ్రామం నుంచి ఇరుముడులుతో శివదీక్షాపరులు శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. గురువారం స్థానిక శివాలయంలో గురుస్వామి రూపామోహన్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించిన అనంతరం 25 మంది శివదీక్షాపరులు శివనామ స్మరణ చేస్తూ బయలుదేరారు.

ఘనంగా పెద్దరాజు స్వామి ఉరుసు


స్వామికి ఫాతెహాలు సమర్పిస్తున్న పీఠాధిపతి

నందవరం: మండల పరిధిలోని పోనకలదిన్నె గ్రామంలో పెద్దరాజుల ఉరుసు ఘనంగా నిర్వహించారు. గురువారం పీఠాధిపతి అక్బర్‌బాషా ఖాద్రి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి పూజలు నిర్వహించారు. స్వామి దర్గాను విద్యుదీపాలు, పూలమాలలతో ప్రత్యేకాలంకరణ గావించారు. ముందుగా స్వామికి పీఠాధిపతి బుధవారం గంధంతో ప్రత్యేక పూజలు చేపట్టారు. గురువారం ఉరుసు మహోత్సవం నిర్వహించారు. మత సామరస్యానికి ప్రతీకగా పెద్దరాజు ఉరుసును పీఠాధిపతి, గ్రామ పెద్దలు, భక్తులు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ పావని, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, రామచంద్రారెడ్డి, గోపాల్ రెడ్డి, జయపాల్ రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

పంట ఉత్పత్తుల ధరలు తెలియజేయండి


ఆర్‌బీకే సిబ్బందికి సూచనలు చేస్తున్న పత్తికొండ ఏడీఏ విజయ్‌మోహన్‌కుమార్

ఆలూరు: రైతులకు పంట ఉత్పత్తుల కనిష్ట, గరిష్ట ధర తెలియజేసేందుకు రైతు భరోసా కేంద్రం సిబ్బంది కృషి చేయాలని పత్తికొండ సబ్‌డివిజన్ వ్యవసాయ సంయుక్త సంచాలకులు విజయ్‌మోహన్‌కుమార్ ఆదేశించారు. అందుకోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సీఎంఎఫ్ యాప్‌లో ధరలను అప్‌డేట్ చేయాలని సూచించారు. ఏడీఏ గురువారం దేవనకొండ ఆర్‌బీకేలో వివిధ గ్రామాల సిబ్బందితో సమావేశమయ్యారు. ఏడీఏ మాట్లాడుతూ.. రైతులకు పంట దిగుబడుల కనిష్ట, గరిష్ట ధరలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. రైతుల ఫోన్లలో యాప్‌ను ఎందుకు అప్‌డేట్ చేయించడం లేదని సిబ్బందిపై మండిపడ్డారు. అలాగే రైతులకు అవగాహన కల్పించి ఈ-కేవైసీ చేయించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో ఏఓ సురేష్‌బాబు, ఎంపీఈఓ విజయరాం, వీఏఏలు మల్లికార్జున, అబ్దుల్, రంగాచారి, తదితరులు ఉన్నారు. అనంతరం వివిధ ఎరువుల షాపులను ఏడీఏ తనిఖీ చేశారు.

పోటీతత్వంతో చదువుకోవాలి

గోనెగండ్ల: విద్యార్థులు పోటీతత్వంతో చదువుతూ రాణిస్తే భవిష్యత్తు ఉత్తమంగా ఉంటుందని జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సురేష్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు వీరన్న, మండల అధ్యక్షుడు ఖాజా, అధ్యాపకులు చంద్రశేఖర్, నూర్ అహమ్మద్, జయరాణి, భాగ్యలక్ష్మి, ఎస్ఎఫ్ఐ నాయకులు సలీం, నందికుమార్, వీరంజిని తదితరులు పాల్గొన్నారు.

హద్దుమీరి ప్రవర్తిస్తే చర్యలు

కృష్ణగిరి: గ్రామాల్లో ఎవరైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో గురువారం రాత్రి ఆయన పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్నచిన్న విషయాలకు గొడవలు పడకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. రహదారి నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండా వాడాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మండలాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

- అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి


మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి

కృష్ణగిరి: అధికారులందరూ బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే మండలం అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లాలో వెనుకబడిన మండలంగా పేరున్న కృష్ణగిరిని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సహకారంతో పనులు చేపడతామన్నారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ్యులు అధికారులకు సహకరించి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జలజీవన్ మిషన్ కింద చాలా గ్రామాల్లో ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చేందుకు పనులు జరుగుతున్నాయని, అలాగే మండల పరిషత్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో మండలాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. తహసీల్దార్ పురుషోత్తం, వైస్ ఎంపీపీ బోయ సుశీల, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ షాలుమియ్యా, పీఆర్ ఏఈ అబ్దుల్ వహీద్, ఏఓ వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పెయింట్ దుకాణానికి నిప్పు

పత్తికొండ రూరల్: స్థానిక గ్రామ పంచాయతీ కాంప్లెక్స్‌లోని ఎంజేఎల్ ట్రేడర్స్ పెయింట్ దుకాణానికి బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టిన ఘటన గురువారం వెలుగుచూసింది. షటర్ కింద అట్టలు, ప్లాస్టిక్ సంచులు పెట్టి పెట్రోలు పోసి నిప్పు అంటించినట్లు షాపు యజమాని లాల్‌బాషా తెలిపారు. అయితే షటర్ వద్దనే నిప్పు ఆరిపోయింది. లోపల పెయింట్ స్టాక్‌కు నిప్పు అంటుకుని ఉంటే భారీ ప్రమాదం జరిగి ఉండేదని పేర్కొన్నాడు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు.

పన్నులు చెల్లించండి

హొళగుంద: గ్రామాభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం ఇచ్చే నిధులే గాకుండ స్థానిక వనరులు ఎంతో అవసరమని, పంచాయతీకి పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందించాలని హొళగుంద మేజర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ కోరారు. 2022-23 సంవత్సరంతో పాటు పాత మొండి బకాయిలు, ఇతర అన్ని రకాల పన్నులను సకాలంలో చెల్లించి పాలక మండలికి సహకరించాలన్నారు. గ్రామ ప్రజలు ఇంటి, కొళాయి పన్నులు, లైసెన్స్ రెన్యూవల్‌లు, బంకు ఎంక్రోచ్‌మెంట్ తదితర అన్ని రకాలు పన్నులు సకాలంలో చెల్లించాలని కోరారు. పన్నులు కట్టకపోతే కోర్టు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సేవతోనే గుర్తింపు

కృష్ణగిరి: పని చేసిన చోట అందించిన సేవలే గుర్తింపునిస్తాయని ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న స్వాములు ఉల్లిందకొండ స్టేషన్‌కు బదిలీ కావడంతో గురువారం ఎస్ఐతోపాటు సిబ్బంది ఆయనకు వీడ్కోలు పలికారు. శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఎస్ఐ సూచించారు. సిబ్బంది నారాయణ, కృష్ణ, మాదన్న పాల్గొన్నారు.

ఈఓకు తప్పిన ప్రమాదం

వెల్దుర్తి: బ్రహ్మగుండం ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ టి.హనుమంతరావ్ గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డారు. ఆలయంలో రేపటి నుంచి ప్రారంభమయ్యే మహా శివరాత్రి ఉత్సవాలకు ప్రముఖులను ఆహ్వానించేందుకు కర్నూలులోని స్వగృహం నుంచి బైక్‌పై బయలుదేరిన ఆయనకు బీ క్యాంప్ వాల్‌మార్ట్ షాపింగ్ మాల్ ఎదురుగా గల యూటర్న్ వద్ద ప్రమాదం జరిగింది. శివమాలధారుడైన ఆటోడ్రైవర్ వాహనాన్ని ఆన్‌లోనే ఉంచి దిగి కూరగాయలు కొనుగోలు చేస్తుండగా గేరు మారిన ఆటో ముందుకు దూసుకొచ్చి ఈఓ బైక్‌ను ఢీకొట్టింది. అదే సమయంలో మరో ఆటో బైక్‌ను రాసుకుంటూ వెళ్లడంతో ఈఓ కిందపడగా కాలికి గాయమైంది. ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఈఓ బ్రహ్మగుండానికి చేరుకుని ఏర్పాట్లు పరిశీలించి, చేపట్టాల్సిన పనులకు సిబ్బందిని పురమాయించి వెళ్లారు.

బ్రహ్మగుండంలో ఉత్సవ సందడి


బ్రహ్మగుండంలో వెలసిన తాత్కాలిక దుకాణాలు

వెల్దుర్తి: బ్రహ్మగుండం ఉత్సవాల సందడి షురూ అయ్యింది. గతంలో జాగరణ రోజుగానీ కానరాని దుకాణాల వ్యాపారస్తులు ప్రస్తుతం రెండ్రోజులు ముందుగానే దిగిపోయారు. ఆలయాభివృద్ధి, సౌకర్యాలు పెరగడంతో భక్తులు పెరిగే అవకాశాలుండడంతో మంచి వ్యాపారం జరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆలయానికి రూ.లక్షల్లో పెండింగ్ బిల్లులతో పాటు, బకాయిలు సైతం ఉండేవి. లక్షల్లో ఆదాయం ఉన్నా నాటి పాలకుల అవినీతి ఫలితంగా సౌకర్యాలు, అభివృద్ధి నామమాత్రంగా ఉండేది. ప్రస్తుతం ఆలయానికి నికర మిగులు ఉండడం విశేషం. ఈ విషయంపై ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈఓ హనుమంతరావ్, చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ కాలం నాటి పెండింగ్ కరెంటు బిల్లులు రూ.2 లక్షలకు పైగా చెల్లించడంతోపాటు, దేవదాయ శాఖకు 20 శాతం నిధుల బకాయి చెల్లించామన్నారు. అంగళ్లు, సముదాయాలకు ఒకే స్లాబుతో రుసుం అమలు చేస్తూ వారికి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం దాతల సహకారంతో అభివృద్ధి చూపి, దేవదాయ శాఖకు నికర మిగులు రూ.6.50 లక్షలు చూపగలిగామన్నారు. ఆలయ ఆదాయం రూ.10 లక్షలకు తెచ్చి గ్రేడ్-1 ఆలయంగా తీర్చిదిద్ది మరింత అభివృద్ధి చేయాలన్నదే తమ ఆశయమన్నారు.

21న వృషభాల బండలాగుడు పోటీలు

వెల్దుర్తి: మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా మహిమాన్విత బ్రహ్మగుండం క్షేత్రం ఆవరణలో ఈనెల 21న రైతు సంబరాలలో భాగంగా ఒంగోలు జాతి ఎద్దుల అంతర్ రాష్ట్రస్థాయి బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి, మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. విజేతలకు మొదటి బహుమతి రూ.50 వేలు (వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి), తర్వాతి స్థానాలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, మరో రూ.10 వేల కన్సోలేషన్ బహుమతి అందించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి 21వ తేదీ ఉదయం 6 గంటల్లోపు వృషభాలతో పోటీ ప్రాంగణానికి చేరుకోవాలన్నారు. వివరాలకు 97036 74555, 79810 14106 నంబర్లను సంప్రదించాలని కోరారు,

19 సిద్ధలింగేశ్వర స్వామి ఉచ్చాయోత్సవం


ముద్దటమాగిలో వెలసిన సిద్ధలింగేశ్వర స్వామి

హొళగుంద: మండల పరిధిలోని ముద్దటమాగి గ్రామంలో ఈ నెల 19న సిద్ధలింగేశ్వర స్వామి ఉచ్చాయోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ గ్రామస్తులు గురువారం విలేకరులకు తెలిపారు. ఉత్సవంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు ఉదయం విరాట్‌మూర్తికి జలాభిషేకం చేసి అనంతరం ఆకుపూజ, రుద్రాభిషేకం, మహామంగళారతి, నైవేద్య సమర్పణ తదితర కార్యక్రమాలను జరిపిస్తారు. సాయంత్రం అశేష భక్తజనుల మధ్య ఉచ్చాయాన్ని లాగుతారని గ్రామస్తులు చెప్పారు. ఉత్సవంలో భాగంగా గ్రామంలో 'కర్ణ అరుజనర కాళగ' అనే సామాజిక బయలు నాటక ప్రదర్శన ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఉన్నత చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రయోగశాల గురించి వివరిస్తున్న అధ్యాపకులు

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థినిలు ఇంటర్మీడియట్ తరువాత చదువులకు స్వస్తి చెప్పకుండా ఉన్నత చదువులు చదివితే ఉజ్వల భవిష్యత్ వుంటుందని స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాష పేర్కొన్నారు.స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినిలతో డిగ్రీ కళాశాలలో గురువారం'ఓపెన్ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు, ఇందులో భాగంగా జూనియర్ కళాశాల విద్యార్థినిలకు డిగ్రీ కళాశాలలో కల మౌళిక సదుపాయాలు, జవహర్‌నాలెడ్జ్ సెంటర్, ప్రయోగశాల, లాంగ్వేజ్ ల్యాబ్, పర్చువల్ తరగతులు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ప్లేస్‌మెంట్ సెల్, గ్రంథాలయం, వ్యాయామశాల, క్రీడామైదానం, ఉద్యాన వనం తదితర విభాగాలను చూపి వాటి గురించి ఆయా విభాగాల అధ్యాపకులు వివరించారు. ఆయా విభాగాలను సందర్శించిన ఇంటర్మీడియట్ విద్యార్థినిలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరం అడ్మిషన్లు తీసుకొనేందుకు సుముఖత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, సురేందర్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఎం.సుశీలమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ఠ


పూజలందుకుంటున్న సుంకులమ్మ అమ్మవారు

మద్దికెర: మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో గురువారం సుంకులమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. నూతనంగా నిర్మించిన దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ, చండీహోమం తదితర కార్యక్రమాలు పురోహితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పూజా కార్యక్రమాల్లో సర్పంచ్ ఆంజనేయులు, హేమంబరధర రావు, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మద్దికెర శివజ్యోతి ఆశ్రమంలోని శివాలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు మల్లికార్జున, మాజీ ఎంపీపీ నీలకంఠ రాయుడు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అవగాహన


పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న ఆలూరు సబ్‌రిజిస్ట్రార్ మురళీమెహన్ శర్మ

ఆలూరు: జగనన్న సమగ్ర భూహక్కు - భూరక్ష పథకంలో భాగంగా ఆలూరు మండలం మనేకుర్తి, మూసానపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు విజయ్‌కుమార్, ఉల్లెప్పలకు ఆలూరు సబ్‌రిజిస్ట్రార్ మురళీమోహన్ శర్మ రిజిస్ట్రేషన్ విధానంపై అవగాహన కల్పించారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మురళీమోహన్ శర్మ మాట్లాడుతూ సమగ్ర భూసర్వే కింద జిల్లాలో ఆలూరు మండలంలోని మూసానపల్లి, కాత్రికి, మనేకుర్తి, అంగస్కల్లు, ఏ.గోనేహాళ్ గ్రామాలను ఎంపిక చేసినట్లు వివరించారు. ఆ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు విజయ్‌కుమార్, ఉల్లెప్పలకు (పీఎల్ఆర్) భూముల క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను స్థానిక గ్రామ సచివాలయంలోనే ఎలా చేయాలన్న అంశంపై సూచనలు, సలహాలు చేశారు. కంప్యూటరీకరణ చేసే విధానాలను వివరించారు. రెవెన్యూ అధికారులు నిర్ధారించిన భూముల ధరలను బట్టి ప్రభుత్వ రుసుం వసూలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూనియర్ అసిస్టెంట్ లక్ష్మి, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

వెల్దుర్తి: పట్టణ సమీపంలోని ప్రముఖ శైవక్షేత్రం బ్రహ్మగుండంలో ఈ నెల 18 నుంచి నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరు కావాల్సిందిగా చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. గురువారం కర్నూలులోని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్వగృహానికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందించారు. తమ వెన్నంటి ఉండి ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ ఉత్సవాలలో పాల్గొనాల్సిందిగా కోరారు. నాయకులు రఘురెడ్డి, శివారెడ్డి, ఎల్లయ్య ఆచారి ఉన్నారు. బ్రహ్మగుండం ఉత్సవాలలో పాతిక సంవత్సరాలుగా జాగరణ రోజున ఎమ్మెల్యే కుటుంబీకులు భక్తులకు ఉచిత అల్పాహారం అందిస్తు, స్వామి వారి సేవలో పాల్గొంటుండడం విశేషం.